సమస్యలుంటే సాక్షికి చెప్పండి

మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను కింద ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి

97053 47483

నంబర్‌ను సంప్రదించండి

క్లుప్తంగా

విమ్స్‌లో ఓఆర్ఎస్, మజ్జిగ ప్యాకెట్ల పంపిణీ



రోగుల బంధువులకు ఓఆర్ఎస్, మజ్జిగ ప్యాకెట్లు అందిస్తున్న విమ్స్ డైరెక్టర్ రాంబాబు

ఆరిలోవ: హనుమంతవాక దరి విశాఖ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(విమ్స్)లో శనివారం స్వర్ణ ఆంధ్ర – స్వచ్ఛ ఆంధ్ర నిర్వహించారు. ఈ సందర్భంగా విమ్స్ ఆవరణలో బీట్ ద హీట్ కార్యక్రమం చేపట్టారు. విమ్స్‌కు వెళ్లే రోగులు, వారి బంధువుల కోసం మజ్జిగ, ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ శిబిరం ఏర్పాటు చేశారు. దీన్ని ప్రారంభించిన విమ్స్ డైరెక్టర్ డాక్టర్ కె.రాంబాబు మాట్లాడుతూ రోగులకు వేసవి వేడి నుంచి ఉపశమనం కోసం ఈ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. వేసవి వేడిని తట్టుకుని ఆరోగ్యాన్ని కాపాడుకోవడం గురించి రోగులు, వారి బంధువులకు అవగాహన కల్పించారు. శరీరంలో డీ హైడ్రేషన్ కాకుండా ఓఆర్ఎస్, మజ్జిగ తదితర పానీయాలు తరచూ తాగాలని, శరీరానికి చల్లదనం కలిగించే ఆహారం తీసుకోవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో విమ్స్ వైద్యులు, నర్సింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

కూలిన చెట్టు తొలగింపు



కూలిన చెట్టును తొలగిస్తున్న జీవీఎంసీ సిబ్బంది

బీచ్‌రోడ్డు: జీవీఎంసీ 20వ వార్డు పెదవాల్తేరులోని హనీ గ్రూప్ లైన్‌లో రోడ్డుపై కూలిన పెద్ద చెట్టును శనివారం కార్పొరేషన్ సిబ్బంది తొలగించారు. చెట్టు కూలిన వెంటనే స్థానికులు కార్పొరేటర్ ముప్పల లక్ష్మీ సురేష్‌కు సమాచారం ఇవ్వగా.. ఆమె జీవీఎంసీ అధికారులతో మాట్లాడారు. వెంటనే సిబ్బందిని పంపించి చెట్టును తొలగించి లారీ ద్వారా అక్కడి నుంచి తరలించారు. ఈ సందర్భంగా ఆమెకు స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు.

అధిక రక్తపోటు ప్రాణాంతకం

మహారాణిపేట: ప్రపంచ రక్తపోటు దినోత్సవం సందర్భంగా వైద్య ఆరోగ్య శాఖ ఉద్యోగులు శనివారం నగరంలో ర్యాలీ నిర్వహించారు. రేసపువానిపాలెంలోని డీఎంహెచ్‌వో కార్యాలయం వద్ద మొదలైన ర్యాలీ సత్యం జంక్షన్ మీదుగా తిరిగి కార్యాలయం వరకు సాగింది. అదనపు జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ పూర్ణేంద్రబాబు జెండా ఊపి ర్యాలీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధిక రక్తపోటుపై అందరికీ అవగాహన కల్పించాలన్నారు. దీని కోసం ప్రతి ఏటా మే 17న ప్రత్యేక కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ హారిక, ఇతర ప్రోగ్రామ్ ఆఫీసర్లు, వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రత అందరి బాధ్యత



ఆరిలోవ కాలనీలో ప్రతిజ్ఞ చేస్తున్న పారిశుధ్య కార్మికులు, స్థానికులు



ఏయూలో పరిసరాలను శుభ్రం చేస్తున్న మాధవ్, ఆచార్యులు



20వ వార్డులో స్థానికులకు అవగాహన కల్పిస్తున్న కార్పొరేటర్ ముప్పల లక్ష్మీ సురేష్



మొక్కలు నాటి నీరుపోస్తున్న జేసీ మయూర్ అశోక్, చిత్రంలో డీఆర్‌వో భవానీశంకర్



ఉద్యోగుల చేత ప్రతిజ్ఞ చేయిస్తున్న జిల్లా మీడియా విస్తరణాధికారి నాగేశ్వరరావు

ఆరిలోవ: ప్రతి నెలా మూడో శనివారం నిర్వహించే స్వర్ణ ఆంధ్ర – స్వచ్ఛ ఆంధ్రలో భాగంగా నియోజకవర్గంలో పలుచోట్ల బీట్ ద హీట్ కార్యక్రమం చేపట్టారు. 13వ వార్డు ఆరిలోవ కాలనీలోని పరిసరాలు జీవీఎంసీ పారిశుధ్య కార్మికులు, స్థానికులు శుభ్రం చేశారు. అనంతరం వీధుల్లో ర్యాలీ చేసి పరిసరాల పరిశుభ్రత, ప్లాస్టిక్ వినియోగ నిషేధం తదితర వాటిపై శానిటరీ విభాగం, స్థానిక పెద్దలు అవగాహన కల్పించారు. అందరూ కలసి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకుంటామంటూ ప్రతిజ్ఞ చేశారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ రామారావు, స్థానిక నాయకుడు కెల్ల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛత నిత్య జీవితంలో భాగం

విశాఖ విద్య: స్వచ్ఛత ప్రజల జీవనంలో అంతర్భాగంగా మారాల్సిన అవసరం ఉందని మాజీ ఎమ్మెల్సీ పి.వి.ఎన్.మాధవ్ అన్నారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం విద్యా విభాగంలో నిర్వహించిన స్వచ్ఛ ఆంధ్ర – స్వర్ణ ఆంధ్ర కార్యక్రమంలో ఆయన పాల్గొని బీఈడీ విద్యార్థులకు పలు సూచనలిచ్చారు. విద్యా విభాగాధిపతి ఆచార్య టి.షారోన్ రాజు మాట్లాడుతూ బీఈడీ విద్యార్థులకు విభిన్న రంగాల్లో నిపుణులతో ప్రత్యేక ప్రసంగాలను నిర్వహిస్తూ సమాజ అవసరాలను తెలియజేసే విధంగా పనిచేస్తున్నట్లు చెప్పారు. అనంతరం విభాగ అధ్యాపకులు డాక్టర్ ప్రకాష్, డాక్టర్ ఆలీ, డాక్టర్ రాము, డాక్టర్ ప్రవీణ తదితరులతో కలిసి మాధవ్, షారోన్ రాజు విద్యా విభాగం పరిసరాలను శుభ్రం చేశారు.

'బీట్ ద హీట్'పై అవగాహన

బీచ్‌రోడ్డు: జీవీఎంసీ 20వ వార్డులో స్థానికులకు బీట్ ద హీట్‌పై కార్పొరేటర్ ముప్పల లక్ష్మీ సురేష్ అవగాహన కల్పించారు. వేసవి తాపం నుంచి రక్షణ పొందేందుకు ప్రతి ఒక్కరూ శరీరానికి చల్లదనం ఇచ్చే ఆహారం తీసుకోవాలని సూచించారు. నీరు, మజ్జిగ, ఓఆర్ఎస్ వంటివి తాగాలన్నారు. జీవీఎంసీ సిబ్బంది పాల్గొన్నారు.

ఉత్సాహంగా 'స్వచ్ఛాంధ్ర–స్వర్ణాంధ్ర'

మహారాణిపేట: జిల్లాలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో స్వచ్ఛాంధ్ర–స్వర్ణాంధ్ర కార్యక్రమాలు ముమ్మరంగా సాగాయి. అధికారులు, సిబ్బంది ఉత్సాహంగా భాగస్వామ్యమయ్యారు. ఆయా కార్యాలయాల పరిధిలో మొక్కలు నాటి సంరక్షణ కోసం కంచెలు వేశారు. సాధారణ పౌరులకు తాగు నీరు, మజ్జిగ పంపిణీ చేశారు. బీట్ ద హీట్ అనే నినాదాలు చేస్తూ కొన్ని కార్యాలయాల అధికారులు, సిబ్బంది అవగాహన ర్యాలీలు చేపట్టారు. ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటు చేసుకొని ఆయా కార్యాలయాల అధికారులకు, సిబ్బందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. కలెక్టరేట్ ప్రాంగణంలోని పార్కులో డీఆర్వో భవానీశంకర్‌తో కలిసి జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్ మొక్కలు నాటారు. గార్డెన్‌లోని చెత్తను తొలగించారు. పరిశుభ్రతా చర్యలు చేపట్టారు. కలెక్టరేట్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో అధికారులు, సిబ్బంది ప్రాథమిక వైద్య పరీక్షలు చేయించుకున్నారు. కలెక్టరేట్ అధికారులు, సిబ్బంది స్వచ్ఛాంధ్ర–స్వర్ణాంధ్ర కార్యక్రమాల్లో పాల్గొని ప్రతిజ్ఞ చేశారు.

డీఎంహెచ్‌వో కార్యాలయంలో..

రేసపువానిపాలెంలోని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో డీఎంహెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వరరావు ఆధ్వర్యంలో స్వచ్ఛాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. కార్యాలయ ఆవరణలో చెత్త తొలగించి మొక్కలు నాటడం వంటి కార్యక్రమాలు చేపట్టారు. తడి చెత్తకు గ్రీన్, పొడి చెత్తకు రెడ్, హానికరమైన చెత్తకు బ్లూ డస్ట్ బిన్లు ఉపయోగించాలని తెలిపారు. వేడిని తరిమికొట్టండి – వడదెబ్బ నుండి కాపాడుకోండి అనే నినాదంతో ప్రజలకు అవగాహన కల్పించారు. పలు విభాగాల అధికారులు, ఉద్యోగుల చేత జిల్లా మీడియా విస్తరణాధికారి బి.నాగేశ్వరరావు ప్రతిజ్ఞ చేయించారు.

శ్రీసత్యసాయి ప్రేమ ప్రవాహిని రథయాత్ర నేడు



యాత్ర కోసం విశాఖ చేరుకున్న రథాలు

ఎంవీపీకాలనీ: శ్రీ సత్యసాయిబాబా శత జయంతి ఉత్సవాల్లో భాగంగా 'శ్రీసత్యసాయి ప్రేమ ప్రవాహిని' పేరిట దేశమంతటా పవిత్ర రథయాత్ర నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా ఈ నెల 18న నగరంలో రథయాత్ర జరగనున్నట్లు సంస్థ ప్రతినిధులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. యాత్రలో పాల్గొనే రథాలు విశాఖ చేరుకున్నాయి. ఆదివారం సాయంత్రం 4 గంటలకు పెదవాల్తేరులోని కరకచెట్టు పోలమాంబ ఆలయం నుంచి రథయాత్ర ప్రారంభం కానుంది. శాంతి ఆశ్రమం, లాసన్స్ బే కాలనీ, ఉషోదయ కూడలి మీదుగా ఎంవీపీ కాలనీలోని సత్యసాయి ప్రేమ సదన్ మందిరానికి చేరుతుంది. అనంతరం అక్కడ సత్యసాయి సేవా సంస్థల ఏపీ అధ్యక్షుడు ఆర్.లక్ష్మణరావు భక్తులను ఉద్దేశించి ప్రసంగించనున్నారు.

ఎంవీపీలో తిరంగా యాత్ర

ఎంవీపీకాలనీ: టీడీపీ ఆధ్వర్యంలో శనివారం ఎంవీపీ కాలనీలో తిరంగా యాత్ర నిర్వహించారు. ఎంవీపీ సెక్టార్–4లోని ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు కార్యాలయం నుంచి పలు కూడళ్ల మీదుగా యాత్ర సాగింది. ఈ సందర్భంగా వెలగపూడి మాట్లాడుతూ భారత సాయుధ దళాలు ఆపరేషన్ సిందూర్‌ను విజయవంతంగా నిర్వహించిన నేపథ్యంలో తిరంగా యాత్ర చేసినట్లు తెలిపారు. జాతీయ జెండాను ప్రదర్శిస్తూ పెద్ద ఎత్తున స్థానికులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

మహిళను కాపాడిన కానిస్టేబుల్



కుటుంబ సభ్యులకు మహిళను అప్పగిస్తున్న కానిస్టేబుల్ బషీర్

ఎంవీపీకాలనీ: ఆత్మహత్య చేసుకునేందుకు ప్రయత్నించిన ఓ మహిళను ఎంవీపీ పోలీస్ స్టేషన్ కానిస్టేబుల్ బషీర్ చాకచక్యంగా కాపాడాడు. వివరాలిలా.. 35 ఏళ్ల మహిళ కనిపించడం లేదని శుక్రవారం ఎంవీపీ పోలీసులకు ఫిర్యాదు అందింది. దీనిపై విచారిస్తుండగా.. శుక్రవారం రాత్రి 11 గంటల సమయంలో కానిస్టేబుల్ బషీర్‌కు పీఎం పాలెం గ్యాస్ గొడౌన్ వద్ద నిర్మాణంలో ఉన్న ఐదంతస్తుల భవనంపై నుంచి ఓ మహిళ దూకి ఆత్మహత్య చేసుకునేందుకు ప్రయత్నిస్తున్నట్లు ఫోన్ వచ్చింది. వెంటనే ఎంవీపీ సీఐ మురళీకి అతడు విషయం తెలియజేయడంతో అందరికీ సమాచారమిచ్చేందుకు సమయం పడుతుందని.. తక్షణం ఆ ప్రాంతానికి చేరుకుని మహిళ ఆత్మహత్య యత్నాన్ని అడ్డుకోవాలని సూచించడంతో బషీర్ హుటాహుటీన అక్కడికి చేరుకున్నాడు. ఒక తాపీ మేస్త్రి సాయంతో ఆమెను మాటల్లో పెట్టి చాకచక్యంగా పట్టుకుని సంరక్షించాడు. అనంతరం మిస్సింగ్ ఫిర్యాదులోని మహిళగా నిర్ధారించుకుని కుటుంబ సభ్యులకు సమాచారమిచ్చి, శనివారం వారికి అప్పగించారు. విధి నిర్వహణలో కానిస్టేబుల్ బషీర్ చాకచక్యంగా వ్యవహరించి మహిళ ప్రాణాలు కాపాడటంపై సర్వత్రా ప్రశంసలు లభించాయి. పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి సైతం బషీర్‌ను అభినందించారు.

చలివేంద్రం ఏర్పాటు



మజ్జిగ పంపిణీ చేస్తున్న ఆరిలోవ మందుల షాపుల నిర్వాహకులు

ఆరిలోవ: ఆరిలోవ మందుల షాపుల నిర్వాహకుల ఆధ్వర్యంలో శనివారం తోటగరువు వద్ద చలివేంద్రం ఏర్పాటు చేశారు. దీన్ని డ్రగ్ ఇన్‌స్పెక్టర్లు అభిప్రియ, కల్యాణి ప్రారంభించారు. వేసవి ఎండల తీవ్రతను తట్టుకునేందుకు తాగునీరు అందుబాటులో ఉంచిన మెడికల్ షాపుల నిర్వాహకులను వారు అభినందించారు. బాటసారులు, ప్రయాణికులకు మజ్జిగ పంపిణీ చేశారు. ఎండల తీవ్రత తగ్గే వరకు ప్రతి రోజు తాగునీరు ఇక్కడ అందుబాటులో ఉంటుందని నిర్వాహకులు తెలిపారు.

అతిథి అధ్యాపకులకు నెలవారీ జీతం ఇప్పించాలి



ఎమ్మెల్యేకు వినతిపత్రం అందిస్తున్న గెస్ట్ లెక్చరర్లు

విశాఖ విద్య: ఆంధ్రా యూనివర్సిటీలో పనిచేస్తున్న అతిథి అధ్యాపకులకు నెలవారీ జీతం ఇప్పించాలని కోరుతూ శనివారం దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణకు వర్సిటీ గెస్ట్ ఫ్యాకల్టీలంతా కలిసి వినతిపత్రం అందజేశారు. ఇంటర్మీడియట్ గెస్ట్ లెక్చరర్‌కు నెలకు రూ.27 వేలు పెంచినట్లుగానే, ఏయూలోని అతిథి అధ్యాపకులకు కూడా నెలవారీ జీతం ఇప్పించాలని కోరారు. రాష్ట్రంలోని అన్ని యూనివర్సిటీల్లో కూడా నెలవారీ వేతనాలు ఇస్తున్నారనే విషయాన్ని ఆయన దృష్టికి తీసుకొచ్చారు. సమస్య పరిష్కరిస్తానని కృషి చేస్తానని వంశీకృష్ణ హామీ ఇచ్చినట్లుగా అతిథి అధ్యాపకులు తెలిపారు. అతిథి అధ్యాపకుల అసోసియేషన్ నాయకులు డాక్టర్ ఎం.సురేష్ మీనన్, డాక్టర్ శిరీష్, డాక్టర్ ప్రసాద్, డాక్టర్ గిరీష్, డాక్టర్ సురేంద్ర, డాక్టర్ ప్రసాద్, డాక్టర్ రాయ్, డాక్టర్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

నేడు బీచ్ రోడ్డులో తిరంగా యాత్ర

ఎంవీపీకాలనీ: కూటమి పార్టీల ఆధ్వర్యంలో ఆదివారం బీచ్ రోడ్డులో తిరంగా యాత్ర నిర్వహించనున్నట్లు నాయకులు తెలిపారు. లాసన్స్ బే కాలనీలోని బీజేపీ కార్యాలయంలో శనివారం విలేకరుల సమావేశంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు పరశురామరాజు, జనసేన ఎమ్మెల్యే వంశీకృష్ణ మాట్లాడుతూ ఆదివారం సాయంత్రం 4.30 గంటలకు పార్క్ హోటల్ కూడలి నుంచి కాళీమాత ఆలయం వరకు ఈ యాత్ర సాగుతుందన్నారు. ఆపరేషన్ సిందూర్‌లో భాగంగా భారత్ సాధించిన విజయాన్ని కొనియాడుతూ యాత్ర చేస్తున్నట్లు చెప్పారు. కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ పాల్గొంటారన్నారు.

కచ్చితమైన కొలతలతోనే విక్రయాలు



మాట్లాడుతున్న జాయింట్ కంట్రోలర్ రాజేష్‌కుమార్

బీచ్‌రోడ్డు: కచ్చితమైన కొలతలతోనే వినియోగదారులకు విక్రయాలు జరపాలని జిల్లా లీగల్ మెట్రోలజీ జాయింట్ కంట్రోలర్ జి.రాజేష్‌కుమార్ సూచించారు. ప్రపంచ లీగల్ మెట్రోలజీ డేను పురస్కరించుకుని శనివారం సిరిపురంలోని పెట్రోల్ బంక్ వద్ద హెచ్‌పీసీఎల్, ఐఓసీఎల్, బీపీసీఎల్ అధికారులు, సిబ్బందికి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డిప్యూటీ లీగల్ మెట్రోలజీ అధికారి రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

డిజిటల్ విద్యలో నైపుణ్యం అవసరం

బీచ్‌రోడ్డు: యువతకు డిజిటల్ విద్యలో నైపుణ్యం కల్పించడమే లక్ష్యంగా క్యాప్‌జెమిని, నాస్కామ్ ఫౌండేషన్ కలయికతో ఏఐ ఫర్ స్కిల్లింగ్ ద్వారా 700 మంది శిక్షణ పొందారని క్యాప్‌జెమిని ఇండియా సీఈవో అశ్విన్ యార్డి తెలిపారు. నగరంలోని ఒక హోటల్‌లో శనివారం శిక్షణ వివరాలను మీడియాకు తెలియజేశారు. దేశంలో కృత్రిమ మేధపై నైపుణ్యం ఉన్న వారికి డిమాండ్ పెరుగుతోందన్నారు. ఈ నేపథ్యంలో యువతకు జనరేటివ్ ఏఐ, రోబోటిక్స్, ఫిన్‌టెక్ వంటి రంగాల్లో ఆధునిక నైపుణ్యాలు అందిస్తున్నామని పేర్కొన్నారు. ఈ శిక్షణ ఫలితంగా చాలా మంది ఉద్యోగ అవకాశాలు పొందారన్నారు. నాస్కామ్ ఫౌండేషన్ సీఈవో జ్యోతీశర్మ మాట్లాడుతూ క్యాప్‌జెమినితో కలిసి చేపట్టిన ఏఐ ఫర్ స్కిల్లింగ్ తమ ఉమ్మడి లక్ష్యం సమ్మిళిత డిజిటల్ ఆర్థిక వ్యవస్థ దృష్టిని ప్రతిబింబిస్తుందన్నారు. దీనివల్ల పేద యువతకు ఏఐ అవకాశాలను అందించడం సాధ్యమవుతుందని చెప్పారు.